# కథ

# షష్టిపూర్తి సంబరం

డా.తంగిరాల మీరాసుబ్రహ్మణ్యం

**ఆరోజు ఉదయం అయిదు గంటలకే మెలకువ వచ్చేసింది శాంతమ్మకు. అవును మరి ఇంటి నిండా కొడుకులు, కోడళ్లు, మనవళ్లు, మనవరాళ్లు, కూతురు, అల్లుడు ఇంతమంది తనకోసం వచ్చినవాళ్లు ఉన్నారు. వాళ్లు లేచే సరికి కాస్త కాఫీ, ఫలహారం లాటివి ఏర్పాటుచేయాలి అనుకుంటూనే పడుకుందేమో తొందరగా తెలివి వచ్చింది.**

అయినా వీళ్ల పిచ్చి కాకపోతే ఆడవాళ్లకు షష్టిపూర్తి సంబరాలేమిటి? ఆయనగారికి అరవై ఏళ్లు నిండి ఆరేళ్లు కావొస్తోంది. అప్పుడేదో పూజలూ, హోమాలూ చేశారంటే అర్థం ఉంది. తనీ మాట అంటే అంతెత్తున లేచింది కూతురు.

''ఇది చాలా అన్యాయం అమ్మా! ఈ విషయంలో కూడా ఆడవాళ్లకు, మగవాళ్లకు మధ్య తేడా చూపడం ఏం ధర్మం?'' అంది కోపంగా.

''అది ఆచారంగా వస్తున్న పద్ధతే తల్లీ.. భర్త దీర్ఘాయుష్మంతుడై ఉంటేనే భార్య సుఖసంతోషాలతో ఉండగలదని అలా ఏర్పాటుచేసి ఉంటారు. అంతేగానీ మగవాడు ఎక్కువ, ఆడది తక్కువ అని చూపడానికి కాదు'' అంటూ కూతుర్ని సముదాయించిందావిడ.

''ఏదయినా ఇద్దరికీ సమానంగా జరపాలి అమ్మా! అయినా ఈ విషయంలో నువ్వు మాట్లాడకు. ఏం చేయాలో మేము చూసుకుంటాం'' అని తేల్చేసింది.

ఇదిగో ఇవాళే ఆవిడ షష్టిపూర్తి. నిన్ననే అందరూ వచ్చేశారు. నెల్లాళ్ల ముందు ఒకసారి అందరూ కూడబలుక్కున్నట్టుగా వచ్చివెళ్లారు. తామిద్దరితో కలిసి, వాళ్ల కుటుంబాలు విడిగానూ ఫోటోలు దిగారు. సరే వాళ్లసరదా వాళ్లది అని నవ్వుకుని ఊరుకున్నారు తనూ, ఆయనా.

పక్కనున్న భర్త శంకరంగారికి మెలకువ రాకుండా నెమ్మదిగా కుడిపక్కకు ఒత్తిగిల్లి, అరచేతులు రెండూ రుద్దుకుని, నెమ్మదిగా కళ్లు తెరిచి కుడి అరచేతివైపు చూస్తూ ''కరాగ్రే వసతే లక్ష్మీ! కరమధ్యే సరస్వతీ కర మూలే భలేద్గౌరీ ప్రభాతే కర దర్శనం'' అని మననం చేసుకుంటూ మంచం దిగింది శాంతమ్మ.

ఆవిడ ముఖం కడుక్కుని, స్నానం చేసి, పూజ ముగించుకుని కాఫీ కలుపుతుండగా ఒకరొక్కరూ లేచి దంతధావనాది కార్యక్రమాలు ముగించి అందరూ ముందుభాగంలో పెద్ద హాలులో సమావేశమయ్యారు.

''అందరికీ కాఫీ మేం పట్టుకొస్తాంగానీ మీరు వెళ్లి హాల్లో కూర్చోండి అత్తయ్యా..'' అంటూ ఆవిడ చేతిలోని పని అందుకుంది పెద్దకోడలు రాధిక.

''మీరుండండత్తయ్యా'' అంటూ బయటకు బలవంతంగా తీసుకొచ్చింది రెండో కోడలు చంద్రిక.

''అమ్మా ఇలా వచ్చి నా పక్కన కూర్చోవే..'' అంటూ తన పక్కన చోటు చూపింది కూతురు రమ్య. అల్లుడు రాజారాం మరికాస్త జరిగి కూర్చుంటూ ''ఈరోజు మీరు ముఖ్య అతిథి అత్తయ్య గారూ!'' అంటూ మేలమాడాడు.

వాళ్లేం చేయబోతున్నారో ఏమిటో ఏమీ అర్థంకాక భర్త వైపు చూసింది శాంతమ్మ.

ఆయన నాకే తెలియదు అన్నట్టు చూసి ఊరుకున్నాడు.

''ఇదిగో మీ తోటికోడళ్లిద్దరూ వంటింట్లోనే తిష్ట వేస్తారా ఏమిటి? త్వరగా వచ్చి కూర్చోండి టైమవుతూంది'' అంటూ హడావుడి చేశాడు పెద్ద కొడుకు గోపాలం.

''నువ్వు టీవీ ఆన్ చెయ్యి అన్నయ్యా.. వాళ్లే వస్తారు'' అన్నాడు చిన్నకొడుకు గోవిందు.

అటుపక్కగా కూర్చున్న మనవళ్లు, మనవరాళ్లు ఏదో గుసగుసలు చెప్పుకుంటూ, మధ్యలో నానమ్మకేసి దొంగచూపులు చూస్తూ కూర్చున్నవాళ్లు కాస్త టీవీ జీవం పోసుకోగానే మంత్రం వేసినట్టు నిశ్శబ్దం పాటిస్తూ అటు తిరిగారు.

హడావుడిగా వచ్చి అందరికీ కాఫీ అందించి తమ భర్తల పక్కనే కూర్చుని టీవీ తెరకు కళ్లప్పగించారు కోడళ్లు.

అప్పుడే ఆ ఛానెల్‌లో శుభాకాంక్షలు కార్యక్రమం మొదలయ్యింది.

ఎవరివో ఫోటోలు చూపిస్తూ శుభాకాంక్షలు చెప్పడం మొదలుపెట్టింది అందంగా అలంకరించుకున్న అమ్మాయి.

శాంతమ్మగారు, శంకరంగారూ అయోమయంగా ముఖాలు చూసుకున్నారు.

''ఇప్పుడు హైదరాబాద్‌లో ఉంటున్న వావిలాల శాంతమ్మగారికి ఆవిడ షష్టిపూర్తి సందర్భంగా వారి కొడుకులు, కోడళ్లు, కూతురు, అల్లుడు, మనవళ్లు, మనవరాళ్లు శుభాకాంక్షలు అందిస్తున్నారు. విందామా?'' చిరునవ్వుతో చెప్పింది టీవీ పిల్ల.

తెరమీద శాంతమ్మ, శంకరంగారు తమ కుటుంబ సభ్యులందరితోనూ కలిసి ఉన్న ఫోటో కనబడింది.

అంతవరకు ఊపిరి బిగపట్టి కూర్చున్న అక్కడివారిలో కలకలం రేగింది.

''హలో గోపాలంగారా? మీ అమ్మగారికి శుభాకాంక్షలు చెప్తారా మరి?'' ఫోనులో అడుగుతోంది టీవీ పిల్ల.

అటువైపు నుండి ఫోనులో గోపాలం గొంతు వినబడింది. ''హలో అమ్మా.. నీకు పుట్టిన రోజు శుభాకాంక్షలు. ఇదిగో నీ కోడలు రాధిక మాట్లాడుతుందిట'' అనగానే టీవీలో రాధిక గోపాలంల ఫోటో ప్రత్యక్షమయింది.

''అత్తయ్యా హ్యాపీ బర్త్‌డే'' అంది రాధిక గొంతు.

''చూశావా వదినా నామాట విని ఎరుపు చీరె కట్టుకుని ఫోటో తీయించుకున్నావు.. ఎంత బాగా వచ్చిందో..'' అంది రమ్య.

''అయ్యో నా నెక్లెస్‌కున్న డాలర్ పమిట చాటున ఉండిపోయింది'' అంటూ నొచ్చుకుంది రాధిక.

''సరే.. నీ మొగుడి ఫోటో చూశావా? హీరోలా ఉన్నాను..'' గర్వంగా అన్నాడు గోపాలం.

ఇంతలో టీవీ యాంకరు మళ్లీ ఫోను తీసింది. ''ఓహో గోవిందుగారా మీరే మీ మదర్‌కి షష్టిపూర్తి విషెస్ చెప్తారా? ఆ ఏంటండీ, నా నవ్వు అందంగా వుంటుందా? థాంక్స్ ఫర్ ది కాంప్లి



మెంట్..'' అంటూ తెర మీద గోవిందు చంద్రికల ఫోటో చూపింది.

''కళ్లద్దాలు తీసేయండీ అంటే వినలేదు.. నా పక్కన ముసలి మొగుడిలా ఉన్నారు. పైగా టీవీ యాంకరు నవ్వు బాగుంటుందని చెప్తారా?'' గుర్రుగా మొగుడికేసి చూసి అంది చంద్రిక.

''నీకా హెయిర్‌స్టయిల్ భలే నప్పింది చంద్రికా! ఈసారి నాకూ అలాంటి ముడి వేసుకోవడం నేర్పు'' కాస్త అసూయ ధ్వనిస్తున్న గొంతుతో పొగిడింది రాధిక తన తోటి కోడలిని.

ఈ మాటల శబ్దంలో గోవిందు అమ్మకు చెప్పిన శుభాకాంక్షలు ఎవరికీ వినిపించలేదు.

ఇంతలో చంద్రిక గొంతు వినబడింది ''అత్తయ్యా మీరు ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలి'' అంటూ.

''ఇప్పుడు శాంతమ్మగారి కుమార్తె రమ్య, అల్లుడు రాజారాం ఆవిడకు బర్త్‌డే విషెస్ తెలియజేస్తారు'' అని యాంకర్ అంటుండగా వారిద్దరి ఫోటో టీవీ తెరమీద ప్రత్యక్షమయింది. ఇద్దరూ ఒకేసారి ''అమ్మా, అత్తయ్యా.. హ్యాపీ షష్టిపూర్తి'' అన్నారు.

''అత్తయ్యా నువ్వు సినిమా యాక్టర్‌లా

ఉన్నావు'' సంబరంగా అంది రమ్య మేనకోడలు, గోపాలం కూతురు అయిన శ్రావ్య.

''మా కాలేజీలో అబ్బాయిలు నాకు జూహీచావ్లా జూనియర్ అని నిక్‌నేమ్ పెట్టేశారు తెలుసా?'' సిగ్గుపడుతూ చెప్పింది రమ్య.

''శాంతమ్మగారూ! అందుకున్నారుగా మీ కొడుకులు, కోడళ్లు, కూతురు, అల్లుడు పంపిన శుభాకాంక్షలు! ఇంకా మీ మనవరాళ్లు శ్రావ్య, కావ్య, మనవళ్లు కాశ్యప్, ఆత్రేయ మీకు షష్టిపూర్తి శుభాకాంక్షలు అందిస్తున్నారు. మీకు మా తరఫున శుభాకాంక్షలు అందిస్తున్నాము. అందుకోండి..'' అంది యాంకర్.

''ఓ..నో..'' చాలా నిరాశగా అరిచారు పిల్లలు. ''ఇది చాలా అన్యాయం డాడీ! మీ అందరి ఫోటోలు చూపి మా ఫోటోలు మాత్రం చూపించలేదు'' శ్రావ్య కోపంగా కాళ్లు నేలకేసి బాదింది.

''కనీసం మా గొంతులైనా వినిపించలేదు...'' ఏడుపుగొంతుతో అన్నాడు మనవడు కాశ్యప్.


''వావ్ శాంతమ్మగారూ! మీవాళ్లు మీకోసం పంపిన గ్రీటింగ్ చూశారా? ఎంత అందంగా ఉందో.. అంతే కాదండోయ్.. ఈ కేక్ కూడా పంపించారు'' అంటూ పెద్ద గ్రీటింగ్ కార్డు, కేక్ చూపింది చిరునవ్వుల టీవీ చిన్నది.

''మీ తరఫున ఈ కేకును నేను కట్ చేస్తున్నా'' అంటూ వెనకాల ''హాపీ బర్త్‌డే టు యూ'' అన్న ట్యూన్ వస్తుండగా కేక్ కట్ చేసి ఒక ముక్క నోట్లో పెట్టుకుంది యాంకర్.

''మీకిష్టమైన హనీ కేక్ రుచి అదిరిపోయింది శాంతమ్మగారూ!'' అని చెప్పి ''ఇప్పుడు వరంగల్లులో ఉన్న వంగపాటి విమలగారికి...'' అంటూ మరొకరి గురించి మొదలుపెట్టింది.

అందరూ గోలగోలగా పైకి లేచారు. ''నేనిచ్చిన కేక్ ఐడియా బ్రహ్మాండంగా ఉంది కదన్నయ్యా'' గోవిందు అన్నాడు.

''అసలు టీవీకి ఫోటోలు పంపి కొత్తరకంగా అమ్మ పుట్టినరోజు.. అదే..షష్టిపూర్తి జరపాలని సూచించింది నేను.. మరచిపోకండి'' రమ్య




దబాయించింది.

''అత్తయ్యగారికి తెలియకుండా ఆ ఫోన్‌కాల్స్ ఏర్పాటుచేసింది నేను కదా!'' అంది రాధిక.

''నేను టిఫిన్ తయారుచేస్తాను'' అంటూ షాక్ నుండి తేరుకున్నట్టు నెమ్మదిగా వంటింటివైపు అడుగులు వేశారు శాంతమ్మగారు.

''అమ్మా! ఇప్పుడదేమీ పెట్టుకోవద్దు. ఇవాళ శ్రావ్యకు కాలేజీలో ఇంటర్వ్యూ ఉంది. ఇక మేము బయల్దేరుతాం'' అన్నాడు కూకట్‌పల్లిలో ఉండే గోపాలం.

''అవునత్తయ్యా కావ్యకు పాటల పోటీలున్నాయి. మేము వెళ్లాలి'' అంది గోవిందు భార్య చంద్రిక. వాళ్లుండేది తార్నాక.

''అమ్మా మీ అల్లుడికి ఇన్‌స్పెక్షను జరుగుతోంది. తొందరగా వెళ్లాలి'' అంది రమ్య లేస్తూ. సైనిక్‌పురిలో ఉంటారు వాళ్లు.


అయిదు నిమిషాలలో ఇల్లంతా ఖాళీ అయిపోయింది. శంకరం గారు, శాంతమ్మ మిగిలారు. ఇద్దరి ముఖాల్లోనూ అయోమయం!

కాసేపటికి తేరుకున్న శంకరంగారు లోపలికి వెళ్లి పట్టుచీరె, స్వీట్స్ తీసుకొచ్చి భార్యకు అందిస్తూ ''శాంతమ్మగారూ! మీకు షష్టిపూర్తి శుభాకాంక్షలు. ఈ చీరె కట్టుకుని వస్తే, మిఠాయి తిని, గుడికి వెళ్లి వద్దాం'' అన్నారు.

మాటలు రానట్టు అవి అందుకుని పూజగదిలోకి తీసుకెళ్లి దేవుడి ముందు ఉంచి, చీరెకు పసుపు కుంకుమ పెట్టి కట్టుకుని వచ్చింది శాంతమ్మగారు.

మిఠాయి త్రుంచి ఆవిడ నోట్లో ఒక ముక్క పెట్టి తనొక సగం తిన్నారు శంకరంగారు.

ఆయన చేతికి అక్షతలు ఇచ్చి భర్త కాళ్లకు నమస్కారం చేస్తున్న శాంతమ్మగారి కళ్లలో సన్నని నీటిపొరతో బాటు పెదవుల మీద చిన్న నవ్వు తొంగిచూసింది.



## జయకేతనం

ఏ చిత్రం ఏ తారకి మంచి పేరు తెస్తుందో చెప్పడం కష్టం. 'జయం' చిత్రంతో జయకేతనం ఎగరేసిన అందాలభామ సదా. తొలిచిత్రంతోనే మంచి అవకాశాల్ని సాధిస్తుందని భావించినా ఆ తర్వాత ఆమెకొచ్చిన ఛాన్స్‌ల్ని పరిశీలిస్తే సెలెక్టివ్ పాత్రలకే ఆమె పరిమితం అయింది. బ్లాక్ బస్టర్ 'అపరిచితుడు' చిత్రంలో విక్రమ్‌తో కలిసి ఆమె నటించి మంచి మార్కులు కొట్టేసింది. కొత్తదనంతో కూడిన పాత్రలంటే తనకెంతో ఇష్టం అని చెప్పే సదా ఇప్పుడు బాలకృష్ణ నటిస్తున్న పేరుపెట్టని కొత్తచిత్రంలో నటిస్తోంది.